



### బొర్రాపు వెంకటరమణ

పాపారావు పంచరంగుల కలలెన్నో కన్నాడు. టెక్నికలర్ కలలన్నా, సినిమాస్కోపు కలలన్నా పాపారావు కెంతో యిష్టం. అందులోనూ ఫైటింగ్ సీన్సు ఉన్న కలలయితే నిద్దర లేవకుండా మాట్యూకొచ్చి సూదులతో పొడిచేవరకూ కంటూ పడుకునే వాడు. పాపారావు ఎన్నో క్రొత్త సినిమాల్ని కలల్లో చూసేసి అందరితో చెప్పేసేవాడు. ఆ స్టోరీల్ని ఎవరయినా డైరెక్టర్ మహాశయుడు వినడం తటస్థిస్తే తప్పకుండా మరో సినిమా తీసి పారేసును. కాని పాపారావుకి అలాంటి వాళ్ళెవరూ తారస పళ్ళేదు. పళ్ళేదు కనకే పాపారావు కన్న కలల్ని ఎవరూ సినిమాలు తీయలేదు. సినిమాలు తీస్తే బావుండునని పాపారావు కూడా ఎప్పుడూ కలలు కనలేదు.

పాపారావు ఒక్కోసారి కలలు కనాలని పని గట్టుకుని పడుకునేవాడు. పడుకునే ముందు తనకు ఎలాంటి కల కావాలనుకుంటే, ఆ విషయాన్ని పదే పదే తల్చుకుని మరీ పడుకునేవాడు. ఈ ఉపాయాన్ని భవిష్యత్తుని గురించి కలలు కనటం నేర్చుకున్న- బుచ్చిబాబు పాపారావుతో ఓసారి చెప్పేడు. బుచ్చిబాబుకి ఈమధ్యే లాటరీలో లక్ష రూపాయలు రావడంతో కలలు కనటం మానుకున్నాడు. అసలు లక్ష రూపాయలు వస్తాయని బుచ్చిబాబు ఎప్పుడూ కలకనలేదు లక్ష రూపాయలు వచ్చినతర్వాతకూడా బుచ్చిబాబుకి చీప కలలే రావటం వలన కలలమీద కోపంకూడా వచ్చి కనటం మానేశాడు. కలలొస్తాయనే భయంతో నిద్రపోవటంకూడా చాలా వరకు తగ్గించేశాడనే చెప్పాలి.

అయితే పాపారావుకూడా లాటరీలో లక్ష రూపాయలు తనకే రావాలని కోరుకున్నాడు తప్ప.బ్యా

బాటున్నైనా ఒక్క రూపాయిచ్చి లాటరీ టిక్కెట్టు కొన్న పాపాన పోలేదు. అందుకే లాటరీలో లక్ష రూపాయలు రానూ లేదు. "నేను చిన్ననే కలగన్నాను రూపాయిచ్చి టిక్కెట్టుకొనివుంటే లక్ష రూపాయలు తప్పకుండా నాకే వచ్చి వుండేవి. అని చెప్పుకునే వాడు పాపారావ్ నిజమేనేమో అనిపించేట్టుగా!


పాపారావు అందగాడు. మాదుడు - వలరాజు - అని రకరకాల పేర్లతో పిలువబడే మన్మధుడెంత అందగాడో తెలీదుగాని పాపారావ్ దారుణమైన అందగాడు. అందుకే అమ్మాయిలకి అతడంటేఎంతోఇష్టం పాపారావ్ కాలేజీలో చదివేటప్పుడు అమ్మాయిలందర్నీ అయస్కాంతంలా ఆకర్షించేవాడు. అతని చూపుని తమవైపు మరలించుకోవాలని అమ్మాయిలు పైట జారవేస్తూ అతని ప్రక్కనుంచి రాచుకుంటూ దూసుకుంటూ వెళ్ళేవాళ్ళు. అయినా పాపారావ్ అవేమి లెఖ్ఖ చేసేవాడు కాదు. అతని హృదయం ఒక్కటే! ఉన్న ఆ ఒక్కగానొక్క హృదయాన్ని కాలేజీలో చేరిన మర్నాడే మాణిక్యానికి అర్పించేశాడు. మాణిక్యం కూడా పాపారావ్ యిచ్చిన ఆ పసిడిహృదయాన్ని పదిలంగా తన పొదుగాటి పర్సులో దాచుకుంది. అందుకే ఆడపిల్లలందరికీ మాణిక్యం అంటే అసూయ. పాపారావ్‌ని తన వల్లో వేసుకుందని చెప్పుకుంటుండేవాళ్ళు. పాపారావ్ మాత్రం వలలోపడి గిలగిలలాడే చేప లాంటివాడు మాత్రం కాదు. జాలరి, తెలివిగల జాలరి. ఇంకా కవిత్వపు ధోరణిలో చెప్పాలంటే వలరాజు. అమ్మాయిలందర్నీ తన వలలోనే వేసుకుంటాడు. అతని ఆ వాకచక్యం ప్రభావానికి లోబడే గాబోలు మాణిక్యం కూడా పాపారావ్‌ని మోహంగా ప్రేమించింది. ఆ ప్రేమ సూర్యుడి లాగ ప్రకాశవంతమైనది — చీకటిలాగ చిక్కనిది - వెన్నెల్లా చల్లనిది - తాపంలా వెచ్చనిది - ఇనుములా గట్టిది - ముఖ్‌మల్‌లా మెత్తనిది - అప్పలాడిలా వీడనిది - అని అందరూ గ్రహించేరు. వాళ్ళిద్దరికీ అడ్డు రావటం మానేశారు. ఏ ఆటంకం లేకుండా హాయిగా విహరించేరు.

పాపారావ్‌కి తల్లీ, తండ్రీ లేరు. అడ్డుచెప్పే వాళ్ళు అసలు లేరు. అందుకే ఎవరి సలహా తీసుకోకుండానే మాణిక్యానికి మంగళసూత్రం కట్టేశాడు మంగళగిరి పానకాలస్వామి గుళ్ళో. పాపారావు తన తరపున పూజారిగారు. మాణిక్యం తరపు నుండి ఆమె స్నేహితురాళ్ళు మల్లిక, మాలతి ఆశీర్వదించి అక్షింతలు చల్లారు. సరిగ్గా శోభన గదిలో మాణిక్యాన్ని ముద్దెట్టుకోబోయే సమయంలో పాపారావ్ కల కరిగిపోయింది. పాపారావ్ కళ్ళు తెరచి అరుస్తున్న అలారాన్ని నేలకేసి కొట్టాడు. మాంచి పట్టులోవున్న కలను చెడగొట్టిందని మహా కోపం వచ్చింది పాపారావ్‌కి. ఇది నెల్లాళ్ల క్రితం పాపారావ్ కాలేజీ ప్రక్కనుంచి షైరెళ్ళొచ్చిన సాయంత్రం కన్న కల!

అబ్బా! ఎంతచక్కటి కలలు!! ఇది నిజమైతే ఎంత బావుండు అనుకునేవాడు పాపారావ్. ఒక్కోసారి 'కట్' అయిన కలలు కంటిన్యూగా కందామని కళ్ళుమూసుకునే పడుకునే వాడు. కాని ఆ కలలకి ఏం పోయేకాలమో గానీ... ఛస్తే తిరిగి కంటిన్యూ అయ్యేవికావు. మరేవో పిల్లల కలలు- పిచ్చి కలలూ వచ్చి పాపారావ్‌ని భోరెత్తించేవి.

పాపారావ్ ఫ్రెండొకడు పూర్ణానందం చెప్తుండేవాడు. "ఒరే వెర్రినాగన్నా! కలలు కల్లలురా! అవి నిజంకావు!" అని పదే పదే వాదించేవాడు. పాపారావ్ ససేమిరా ఒప్పుకొనే వాడుకాదు. 'కలలు ఒకనాటికి నిజమౌతాయి. అందులోనూ తెల్లవారు ఝామున వచ్చిన కలలున్నాయి చూశావూ అవి ఖచ్చితంగా జరిగి తీరుతాయి... దమ్ముంటే పందెంకాయి!" అంటూ ఛాలంజీ చేసేడు పాపారావ్.

పూర్ణానందం ఆలస్యం చేయకుండా జేబులోంచి పాతిక రూపాయలు తీశాడు. "షంషేర్‌గా కాస్తా! పాతిక పాతిక పందెం! రానీయ్ పాతిక!"



పబ్లిక్‌పరీక్షల్లో వాచర్‌గా వెడుతున్నారు కదూ అందుకు..

అన్నాడు పాతికున్న చేయి ముందుకుచాపి.

పాపారావ్ 'థూ' అని ఉమ్మేశాడు.

"పాతిక బోడిపాతిక! సత్తువుంటే నూరు కట్టు... నూటపాతిక్కట్టు... అల్లాటప్పా పాతిక పందెం అక్కర్లేదురా నాన్నా!" అని వెక్కిరించాడు పాపారావ్.

"అయితే క్షణమాగు యిక్కడే... యిప్పుడే వస్తాను!" అన్జెప్పి పరుగునెళ్ళి అయిదు నిమిషాల్లో అయిదు పాతికలు సంపాదించుకు వచ్చాడు (అప్పుచ్చుకున్నాట్ట ఎక్కడో) పూర్ణానందం!

"ఒరే పావం! నూటయాభైకి పందెం కాయంరా! ఏదీ నీ నూటయాభై రానీ!" అన్నాడు.

తండ్రి పంపిన రెండొందల్లోంచి నూటయాభై తీసి పూర్ణానందం చేతిలో పెట్టేడు.

పందెం పందెం కలిశాయి!

"ఆః ... ఇప్పుడు యిద్దరం పోయి నిద్ర పోదాం... ఇప్పట్నుంచి తెల్లారే సరికల్లా నీవో మంచి కలగను, నేనో మంచి కల కంటా... ప్రొద్దున్నే కలుసుకుని మనకొచ్చిన కలలు చెప్పుకుందాం... ఈ వారం లోగా మనకలల్లో ఏ ఒక్కటి నిజమైనా నేను గెల్చినట్టు ఏదీ నిజంకాకపోతే నీవుగెల్చినట్టు తెల్సిందా" అన్నాడు పాపారావ్. "ఓ యస్" అన్నాడు పూర్ణానందం.

రెండో రోజు పాపారావ్, పూర్ణానందం కలుసుకున్నారు. పూర్ణానందం తన కల గురించి చెప్తూ "రాత్రికలలో నేను ఒక రూపాయి పెట్టి కొన్న లాటరీ టిక్కెట్టుకి పాతిక వేలు ఛాన్సు తగిలిందిరా. దాన్లో నీకు అయిదు వేలు యిచ్చాశానట"

పాపారావ్ ఊః..కొట్టి తన కలని చెప్పాడు. "నేను కారు యాక్సిడెంట్‌లో బాగా దెబ్బలు తగిలి ఆస్పత్రిలో పడ్డానట." అని.

పూర్ణానందంకి వచ్చిన కల వారంలోగా నిజంకాకపోతే తానుకారుక్రిందపడిదెబ్బలు తిని పందెం గెల్చుకుందామని పాపారావ్ ఐడియా!

పూర్ణానందంకి నిజంగా అలాంటికల వచ్చిందో లేక పోటీ కోసం అలా సృష్టించి చెప్పేడో తెలీదు గానీ...ఆశ్చర్యమేమంటే ఆకల వచ్చిన ఐదో రోజునే. రెండ్రోజుల క్రిందట కొన్న పంజాబ్ లాటరీ టిక్కెట్టుమీద పూర్ణానందంకి "యాభై వేలు" వచ్చింది. పాపారావ్ ఎగిరి గంతేశాడు.

"చూడరా చవటా! కల నిజమైంది..కలలో పాతికవేలువస్తే నిజంగా యాభై వేలు వచ్చాయి... ఇప్పుడేమంటావ్..పందెండబ్బులు మూడొందలూ.. కలలో నీవు యివ్వాలనుకొన్న అయిదు వేలు యిలా పడేయ్" అన్నాడు.

పూర్ణానందం ఆనందంతో ఉప్పొంగి పోతూ అయిదు వేల మూడొందల రూపాయల్ని పాపారావ్ చేతికి యివ్వబోయే సమయంలోనే టెక్నికలర్ కల "కట్" అయిపోయింది. పాపారావ్ కళ్ళు తెరవకుండానే కాళ్ళ దగ్గరున్న స్టూల్‌ని కసికొద్దీ తన్ని "అబ్బా" అంటూ పైకి లేచాడు. కళ్ళు తెరచిన పాపారావ్ గభాల్న కళ్ళు మూసుకున్నాడు. తీక్షణ సూర్యకిరణాలు కళ్ళల్లో గుండు సూదుల్లా గుచ్చుకున్నాయి.

"వెధవ ఎండ...ముదనష్టపు ఎండ...అయిదు వేల మూడొంద్రూపాయిల కలని చెడగొట్టింది." అంటూ విసుక్కున్నాడు పాపారావ్.

ఇది ఇప్పుడే వచ్చి ఫేలయిన కల:

పాపారావ్ ప్రక్కమీంచి లేచి గబగబా ముఖం కడుకున్నాడు. బట్టలేసుకుని రూములోంచి బయట పడ్డాడు.

పాపారావ్ విజయవాడ్లోనే ఏదో యల్డీసీమార్కు ఉద్యోగాన్ని వెలగబెడ్తున్నాడు. తన కొచ్చే నూట యాభైలోనూ యాభై ఇంటికి పంపి తక్కిన దాన్తో తన ఖర్చులు, అవసరాలు సర్దుకు పోతుంటాడు. విజయవాడకి వందమైళ్ళ దూరంలో వున్న ఓచిన్న పల్లెటూళ్లో వుంటుంది పాపారావ్ వాళ్ళఫామిలి.

పొలం కౌలుకి తీసుకొని వ్యవసాయం చేస్తోన్న తండ్రి; విడవకుండా బదేళ్ళ నుంచి పీడిస్తోన్న జబ్బుతో మంచం పట్టిన తల్లి, మొగుడు విడిచి పెట్టేసిన అక్కయ్య, రెండేళ్ళ క్రిందట పొలం

ఫీజులు కట్టలేక పాపారావ్ చదువు మానేసి మిలటరీలో చేరిపోయిన తమ్ముడు. నెల రోజుల క్రిందటే తొమ్మిదినెలలూ నిండి ప్రసవించటానికి పుట్టింటికి వెళ్ళిన పెళ్లాం. అంతా ఒక్కసారిగా గుర్తొచ్చారు రోడ్డుమీద నడుస్తున్న పాపారావ్‌కి.

పాపారావ్ మధ్యతరగతి కుటుంబంలో పుట్టటం మూలాన చిన్నప్పట్నించీ టెక్నికలర్ కలలు కన టం నేర్చుకున్నాడు ఎవరి ప్రమేయం లేకుండానే. విశేషమేమంటే అతను కల కనకుండానే యస్సెల్సీ ప్యాసై విజయవాడలో ఉద్యోగం సంపాయించడం జరిగింది. అదీ పిలచిచ్చిన పెద్దమనిషి పుణ్యమా అని. మొగుడూ పెళ్లాం ఇద్దరే కాబట్టి చెదపులాంటి ఇల్లు గకుండా చందన పెట్టెలాంటి చిన్న రూము అద్దెకు తీసుకున్నాడు పాపారావ్. జోడు మనుషుల రూములోని సంసారాన్ని జాలీగా లాక్కొస్తున్నాడు పాపారావ్, త్వరలోనే మూడో మనిషి తయారవ బోతున్నాడని గ్రహించిన పాపారావ్ పెళ్ళాన్ని పుట్టింటికి తోలేశాడు.

రోడ్డుమీద నడుస్తూ ఆలోచిస్తున్న పాపారావ్‌కి ఆరోగ్యస్వామి అడ్డు తగలటం మూలాన తక్కున ఆగిపోయి విచిత్రంగా నవ్వి చెయ్యెత్తి ఓ సలాం పారేశాడు.

"ఏంవోయ్ పారేశావ్! రోడ్డుమీదకూడా కలలు కంటున్నావా? ఏంటిది? జాగ్రత్తగా నడు! ఏ లారీ క్రిందైనా పడగలవు..." అని హెచ్చరించి చక్కా పోయాడు ఎప్పుడూ రకరకాల రోగాల్తో సతమతమయ్యే ఆరోగ్యస్వామి.

"ఔను నిజమే!" అనుకుని ఆలోచించటం కట్టిపెట్టి ముందుకు చూస్తూ నడవసాగేడు పాపారావ్.

అసలు పాపారావ్ ఇంతకుముందు ఎన్నో తీయటి కలలు కన్నాడు. ఎన్నో ఊహాసౌధాలు కట్టేడు. వాటినే కలలుగా కన్నాడు.

తనో డబ్బుగలాడి కూతుర్ని పెళ్ళాడి భారీ ఎత్తు బిజినెస్ చేసి లక్షాధికారి అయ్యేడు. లాటరీలో లక్ష రూపాయలు సంపాయించి సినిమాహాలు కట్టించాడు. సి. ఐ. డి. ఉద్యోగం చేసి అంతర్జాతీయ గూఢచారుల్ని బంధించి ప్రభుత్వ మన్ననల్ని పొందేడు. సినిమాలో హీరోగా నటించి హిరో యిన్ని బలంగా కౌగిలించుకున్నాడు. మంత్రిగా ఎన్నికై రాజకీయాల్లో తిరిగినంత కాలం లక్షలు గడించాడు. విమానంమీద ప్రపంచయాత్ర చేసొచ్చాడు. చంద్రమండలంమీద మొట్టమొదటి మానవుడిగా తనే అడుగు పెట్టాడు.

ఇవన్నీ పాపారావ్ కన్న కలలు. అతని కోరికల్నే కలలు కని తీర్చుకున్నాడు తప్ప, ఆ కలలు ఏనాడూ నిజం కాలేదు. నిజమౌతాయన్న ఆశ లేదు.

"అబ్బా! ఇవన్నీ నిజమైతే ఎంతబావుండు!" పదేపదే అనుకునేవాడు పాపారావ్. ఒక్కోరోజు వచ్చిన కలని చూసి పాపారావ్ దంగైపోయి - ఆ కల నిజమైతే దేవుడికి కొబ్బరికాయ కొడ్తానని మొక్కుకునేవాడు. అదేం దురదృష్టమో! ఒక్క చిల్లర కలనైనా నిజం చేశాడు కాదు ఆ దేవుడు.

తనకి తెలీకుండానే ఆలోచనల్లోపడ్డ పాపారావ్‌కి ఈసారి మంత్రాల పంతులుగారు ఎదురై పాపారావ్‌ని పలకరించి తిథి, వార నక్షత్రాలు చెప్పాడు. ఇంకా ఏదో సూర్య డన్నాడు. నక్షత్రా లన్నాడు. శుక్రుడన్నాడు. శ్రాద్ధం అన్నాడు. అవేం పాపారావ్‌కి అర్థం కాలేదు. మంత్రాల పంతులుగారు చివర్లో చెప్పిన ఒక్కమాట పాపారావ్ బుర్రలోకి తుపాకీ తూటాలా దూసుకు పోయింది.

"ఈవేళ సరిగ్గా రెండూ యాభైయైదు నిముషాలకి కన్నకలలు తప్పకుండా నిజమౌతాయన్నమాట. నక్షత్ర శాస్త్రంలో రాసుంది" మళ్ళీ తరవాతయింకేవేవో గ్రహాల గురించి చెప్పుకొచ్చేడు పంతులుగారు. జేబులోంచి పదిపైసలుతీసిపంతులుగారిచేతిలో పడేశాడు.

"నీ కలలన్నీ నిజమగుగాక!" దీవించి వెళ్ళి పోయేరు పంతులుగారు.

పాపారావ్ పబ్లిక్‌పార్కులో కూర్చుని పన్నెండున్నర వరకు ఆలోచించేడు.

ఈవేళ సరిగ్గా పంతులుగారు చెప్పిన సమయానికే మాంచికల కనాలి పంతులుగారి జోస్యం కూడా ఎలావుందో చూద్దాం అనుకున్నాడు పాపారావ్.

ఎలాటి కలకనాలి? అనే సమస్య ఎదురయింది.


తనకి యింక్రిమెంట్ వచ్చినట్టు కలగంటే ... ఛ...! ఛ...! చాలా చచ్చుకోరిక. తనకీ, భార్యకి మగపిల్లవాడు కావాలనుకుంటున్నారు ... ఆవిడ ప్రసవించి మగపిల్లాడు పుట్టినట్టు కలగంటే ... ఊహూఁ... ఇది చాలా చీప్‌కల! పెద్ద బిల్డింగ్ కట్టినట్టు కలనైనా - లాటరీలో ఫస్ట్ ప్రైజ్ వచ్చినట్టు కలగంటే - నేనే ఆఫీసర్ని అయిపోయినట్లు కలనైనా - మంత్రి నైనట్టు కలనైనా - పాతిక లారీల యజమాని నైనట్టు కలొస్తే - వీటిలో ఏ కలకన్నా ఫర్వాలేదు. ఏఒక్కటి నిజమైనా తన జీవితం పూర్తిగా మారిపోతుంది అనుకున్నాడు. పాపారావ్.

ఇంకా ఆలస్యం చేస్తే టైం దాటిపోతుంది అనుకుని గభాల్న లేచాడు.

ఇంటికెళ్తూ మధ్యదార్లో మెడికల్ షాపుకెళ్ళి రెండు స్లీపింగ్ టాబ్లెట్స్ కొనుక్కు వెళ్ళాడు. ఎందుకంటే రకరకాల ఆలోచనల్తో నిద్రపట్టక పోతే పంతులు చెప్పిన టైం దాటిపోతుంది. విశేషంలాంటి అదృష్టం చేజేతులా వదులుకోవలసి వస్తుంది. అందుకే ఆ నిద్దర మాత్రల్ని మింగి గుర్రుపెట్టి నిద్రపోయి బంగారుకల కందామనుకున్నాడు.

రూముకు చేరింతర్వాత టైంచూసుకున్నాడు. ఒంటిగంటన్నరయింది. టైం దగ్గర పడ్తోంది.

హడావుడిగా ప్రక్కనున్న పాండురంగ



విలాస్‌కి వెళ్ళి, వేడివేడి కాఫీ పట్టుకొచ్చేడు. లోపల గడియ వేశాడు. కాఫీతో రెండు నిద్ర మాత్రలు వేసుకుని మంచం మీద వెనక్కి వాలేడు. కలల గురించి ఆలోచిస్తుండగానే తెలీకుండానే నిద్ర పట్టేసింది పాపారావ్‌కి. రెండు యాభైయైదు అయ్యేసరికి పాపారావ్ గుర్రుపెడ్తూ మంచినిద్రలో కలలో - ఉన్నాడు.

మూడున్నరయింది. నిద్రపోతున్న పాపారావ్ ముఖం నిండా చెమటలు పట్టేయి. నిద్రలోనే మనిషి చలిజ్వరం వచ్చిన వాడిలా వణికిపోతున్నాడు. ఉన్నట్టుండి పాపారావ్ పెద్దగా గావుకేక పెట్టి లేచి కూర్చున్నాడు. కళ్ళు నులుముకుని గదినినాలుగుమూలలావిచ్చివాడిలా కలయజూశాడు. కిటికీ లోంచి దూరంగాఉన్న గాంధీహిల్ కనిపిస్తోంది.

పాపారావ్ ఇంకా విపరీతంగా వణికిపోతూనే వున్నాడు. చమటల్తో వళ్ళంతా తడిసిపోయింది. పెదాలు భయంతో కంపిస్తున్నాయి. వచ్చిన కల తల్చుకుంటుంటే గుండె ఝల్లు మంటూంది పాపారావ్‌కి.

అలాంటి కల ఇంతవరకెప్పుడు పాపారావుకి రాలేదు. భయంకరమైన కల ! అంత కంటేఘోరమైన కలల్ని కన్నాడు పాపారావ్. వికృతమైనరాక్షసుల్తో పోరాడి రాజకుమార్తెల్ని రక్షించాడు. నరకలోకాన్ని సందర్శించాడు. యముడితో పోరేడు, బాంబు యుద్ధంలో పాల్గొన్నాడు. ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమంలో పాల్గొని లాఠీ దెబ్బలకు గురయ్యాడు. తెలంగాణా ఉద్యమంలో స్టేషన్లని తగలబెట్టాడు. అప్పుడుకూడా భయపళ్ళేదు పాపారావ్ !

పాపారావ్ వేగంగా కొట్టుకుంటున్న గుండెల్ని ఓసారి చేతితో తాకి చూసుకున్నాడు. "భగవాన్ ! ఈ కలని మాత్రం నిజం చేయకు..." అనుకున్నాడు. మనస్సులో పైకికూడా అనేశాడు.

అంతలో తలుపుమీద ఎవరో దబదబా బాదేరు.

పాపారావ్ గుండెలు ఆగిపోయాయి. మళ్ళీ ముఖంనిండా చెమటలు పట్టేశాయి. కాళ్ళు చేతులు అతని మాట వినకుండా విపరీతంగా వణికిపోతున్నాయి. గొంతు ఎండుకుపోయింది.

మళ్ళీ తలుపులు దబదబ మన్నాయి !!

పాపారావ్ యేమీ ఆలోచించలేక పోతున్నాడు. బుర్రంతా ఖాళీ అయిపోయింది. అతనికి తెలియకుండానే మెల్లగా లేచివెళ్ళి తలుపు తీశాడు.

ఎదురుగాఉన్న వ్యక్తి చిన్నగా నవ్వాడు !

"టెలిగ్రాం సార్ !" అన్నాడు.

పాపారావ్ సంతకంపెట్టి కవరు అందుకుంటుండగా చేతులు వణికేయి.

ఆమనిషి వెళ్ళగానే కవరు అతృతగా చించి చదివి స్థాణువులా నిలబడి పోయాడు.

"మదర్ డైడ్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ"

అక్షరాలు వెక్కిరిస్తున్నాయి పాపారావ్‌ని.

కలలో కనిపించిన అమ్మశవం - శ్మశానం - కాష్ఠంలో బూడిద. అన్నీ పాపారావ్ కళ్ళముందు మళ్ళీ కనిపించేయి !

పాపారావ్ కళ్ళలో నీళ్ళు తిరిగేయి. దుఃఖం పొర్లుకు వచ్చింది. టెలిగ్రాం కాయితంవేపు ఏకదీక్షగా చూస్తున్నాడు.

"కల నిజమయింది !" పిచ్చెత్తినట్టు గట్టిగా అరుస్తూ వెనక్కు విరుచుకు పడ్డాడు పాపం పాపారావ్ !

★

# మా మనుషులు మన్నించరు

నాగరికతా సామ్రాజ్యంలో
నరహంతక చక్రవర్తీ -
ధనవంతుల లోకంలో
దురహంకారపు మనిషీ—
నీవుచేస్తున్న విచ్చలవిడి చర్యలు
మానవాళి పతనానికి గుర్తులు—
నిన్నొక వున్మాదిలా—
నీ చేష్టల్ని ఓపిచ్చివాడి
చచ్చుపనులా జమకడుతున్నాం—
లేకపోతే ఏమిటి—
నిన్న నేకదా - రావణకాష్ఠంలా
రాజుకొన్న భీకరయుద్ధం
అనుకోకుండా ఆపింది - నువ్వు—
యింకా నిన్నటి పోరాటంలో
చిందిన కపోష్ణరుధిరం
యింకి పోనేలేదు—
మొన్నటి సంకులసమరపు
స్టెన్‌గన్న, బాంబర్ల ప్రేలుడు
మాకర్ణపుటాలనుండి యింకా
తప్పుకోనేలేదు—
అటుమొన్నటి హిరోషిమా,
నాగసాకీల తెగిపోయిన
తలల చిగుళ్ళు యింకా
మొలకెత్తనే లేదు—
మళ్ళీ ప్రారంభించేవు నీవు,
నీ దురహంకార పూరిత కయ్యాల
వియ్యాలు—
కానీ నీ యింటి ముంగిట తోటలో
పెంచుకొంటూనే వున్నావు
చెదలు పట్టిన నాగరికత—
అతిశయాల భోగన్‌విల్లాలు—
నీలోకంలోని ప్రజలే నిన్ను
వ్యతిరేకిస్తున్నారు—
నీ నాకంలోని వరులే
నీ యుద్ధం సిద్ధంచేస్తున్నారు—
నీలోకంలోని మార్ఫియా,
మార్జువానా, డోప్,
ట్రాంక్విలైజర్ల మత్తయిన నాగరికత
షేక్, ట్విస్ట్ - బీటిల్స్ - హిప్పీలు,
నైట్‌క్లబ్బుల పచ్చిశృంగారపు
విశృంఖలత -
అలసిపోయి—
సొలసిపోయి—
వలస పోతోంది—
ఎవరెస్ట్ అంతటి మహోన్నత
మహిమాన్విత నాగరికతా నాకలోకి—
కన్యాకుమారీ సైకతస్థలాల
పవిత్ర నీరవ ప్రశాంతతలోకి
కాబట్టి ఓ - నరహంతకుడా
రక్తపిపాసీ—
యిప్పటి కయినా కళ్ళువిప్పు
యిక నీ యుద్ధపు రథచక్రాలు
వెనక్కి తిప్పు—
లేకపోతే రాగలవు తీవ్ర
పరిణామాలు—
'మానవతా' కాన్వెంట్లో
మా 'నవతా' 'కిండర్‌గార్టెన్లో'
దిద్దుకోవయ్యా 'ఓ నామాలు'
నీ జాతిని నీవే చంపుకునే
నీ చర్య మానవత అనిపించదు -
తమలోకపు కాంతిని భగ్నంచేసే
నిన్ను మామనుషులు మన్నించరు

- సితారా

(16వ పేజీ తరువాయి)

రంగు రంగుల ప్రకృతిదృశ్యాల్ని కత్తిరించి చుట్టూ సన్నగా జిగురు ప్రాసి అంటించాలి. అంతే ముందు టెలిఫోన్ పేపరు దానివెనుక మనం అతికించబోయే రంగుల చిత్రం ఉండాలి. అప్పుడు బొమ్మలు టెలిఫోన్ పేపరులో నుండి తళతళలాడుతూ అత్యంత ఆకర్షణీయంగా ఫ్రేముల్లో కనిపిస్తాయి. ఈ ఫ్రేములకు మధ్యనున్న భాగంగా మీకు వచ్చిన విధంగా ఆర్టువర్కు చేస్తే ఇంకా నిండుగా ఉంటుంది. దీనిని మీ టేబుల్‌మీద ఫ్లవర్‌స్టాండ్ ప్రక్కనే అమర్చితే ఎంతో అందంగా ఉండి మీ గదికి నూతన శోభను చేకూర్చుతుంది.

- యల్. భాగ్యలక్ష్మి